సాక్షి
అనకాపల్లి
ఆదివారం | 13 | జూలై | 2025




దయచేసి వినండి.. 8లో

వాల్తేరు డివిజన్‌లోని 17 రైళ్లకు పేర్లు మార్చాలన్న ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చింది. రుషికొండ, **సింహాచలం తదితర పేర్లను ప్రతిపాదించారు.**



విశేష స్పందన

విశాఖ: పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి కళ్యాణ మండపంలో చేనేత హస్త కళ ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది.



వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి నిత్యకల్యాణం శనివారం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

సంచార చికిత్స కేంద్రాలతో మెరుగైన వైద్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి



సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

తుమ్మపాల: సంచార చికిత్స కేంద్రాలతో గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి తెలిపారు. మండలంలో వెంకుపాలెంలో సంచార చికిత్స కార్యక్రమాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ, పలు రకాల సేవలపై రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సంచార చికిత్స కేంద్రాల ద్వారా వైద్య పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. నిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని వారి సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీల ద్వారా ఉన్నత ఆస్పత్రులకు వైద్యులు సిఫార్సు చేస్తున్నారని, ఎటువంటి అనారోగ్య పరిస్థితులు ఏర్పడినా తక్షణమే పీహెచ్‌సీలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో తగరంపూడి పీహెచ్‌సీ డాక్టర్ పావని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణ

విశాఖ సిటీ: విశాఖపట్నం మాస్టర్ ప్లాన్-2041 పునఃపరిశీలన కోసం ఈ నెల 16, 17 తేదీల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి బుధ, గురువారాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు వీఎంఆర్‌డీఏ 3వ అంతస్తు సమావేశ మందిరంలో మాస్టర్ ప్లాన్‌పై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని వివరించారు.

ముగ్గురు యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన యువకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ముగ్గురు యువకులు కొట్టుకుని పోతుండగా లైఫ్‌గార్డ్స్ ప్రాణాలు కాపాడిన సంఘటన చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన ఐదుగురు యువకులు శనివారం సాయంత్రం రుషికొండ బీచ్‌కు వచ్చారు. కాసేపు సరదాగా గడిపిన అనంతరం స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో బి.శ్రీనివాసరావు, ఎం.రామ్, ఎ.శివ కొట్టుకుని పోతుండటంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, ఎం.అమ్మోరు చిన్న పృన్న, గురుమూర్తి, జి.దేవ గుర్తించారు. వారిని రక్షించి, తీరానికి తీసుకువచ్చారు. వారికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. లైఫ్‌గార్డ్స్ ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటి సమస్యలపై చర్చిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామస్వామి, డిప్యూటీ ఇంజినీర్ ఎం.జయరామ్, నాలుగు మండలాలకు చెందిన జేఈలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి నుంచే తాగునీటి వ్యవస్థను మెరుగుపరిస్తే వచ్చే ఏడాది వేసవిలో ఇబ్బందులు ఉండవని సూచించారు. ప్రతి గ్రామంలో తాగునీటి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించాలని, సమస్యలు ఉన్న గ్రామాల్లో పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైన నిధులను తీసుకురావడానికి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని స్పీకర్ చెప్పారు. నీటి నిల్వలు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. సమగ్ర నివేదికను తయారు చేసి నివేదించాలని అధికారులకు సూచించారు.

కష్టాల ఖరీఫ్

- మందగించిన **రుతుపవనాలు**
- 20 మండలా**ల్లో కరువు ఛాయలు**
- నాటిన నారు **ఎండిపోతున్న దైన్యం**
- డ్రమ్ములతో **ఆకుమడులు** తడుపుతున్న **రైతులు**
- రైతు సేవా కేం**ద్రాల్లో ఇచ్చిన వరి** విత్తనాలతో **తగ్గిన మొలక శాతం**
- రెండో దఫా **సొంత విత్తనాలు** వేసుకున్న **రైతులు**
- అవి కూడా ఎండకు ఆవిరై పోతున్నాయంటూ ఆవేదన

ముందుగానే వరుణుడు కరుణించాడని ఆనందించారు. అన్నదాతలు ఉత్సాహంగా విత్తనాలు నాటారు. ఆశించిన స్థాయిలో మొలకలు రాలేదు. ఇంతలో వర్షాలు ఆగిపోయి జూలై నెలలో మండు వేసవిని తలపించేలా ఎండలు మండిపోవడం మొదలైంది. నేల బీటలు వారి వరి ఆకుమడులు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో పదును తగ్గకుండా రైతులు ఆకుమడులను రక్షించుకునే పనిలో పడ్డారు. నీరు తెచ్చుకొని నారు తడుపుతున్నారు. కరువు ఛాయలు కనిపించడంతో ఆందోళన చెందుతున్నారు.



కందిపూడిలో ఎండిపోతున్న ఆకుమడిని తడుపుతున్న రైతులు



మాడుగుల మండలం సత్యవరంలో వరి నారును నీటి ట్యాంకర్‌తో తడుపుతున్న రైతులు



బుచ్చెయ్యపేట పొలాల్లో నేల బీటలు వారి మొలకెత్తని వరి విత్తనాలు

జిల్లాలో ఖరీఫ్ సాగు లక్ష్యాలు
అన్ని పంటల సాగు 2.1 లక్షల ఎకరాలు
వరి సాగు లక్షా 50 వేల ఎకరాలు
వరి విత్తనాల పంపిణీ 23 వేల క్వింటాళ్లు

మాడుగుల/బుచ్చెయ్యపేట

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చాయి, ఖరీఫ్ పంటలకు ఢోకా లేదని అన్నదాతలు ఆనందించారు. వారం రోజులు వరుసగా చినుకులు రాలడంతో రైతు సేవా కేంద్రాల నుంచి తీసుకున్న ఖరీఫ్ వరి విత్తనాలతో నారు వేశారు. వారం రోజులు దాటినా మొలకలు రాకపోవడంతోనే కష్టాలు మొదలయ్యాయి. ఇంతలో వర్షాలు ఆగిపోయి మళ్లీ ఎండలు మొదలయ్యాయి. కాడెద్దుల సవ్వడితో ముంగారు వర్షాలతో ఆనందంతో సేద్యం చేయాల్సిన వ్యవసాయదారులు ఈ ఏడాది నాటిన వరి నారు ఎండిపోవడంతో ఉసూరుమంటున్నారు.

మరోపక్క రెండో దఫా వేసిన వరి విత్తనాలు ఇంకా మొలకలు రావడంలేదు. ఖరీఫ్ సీజన్ దాటిపోతుందన్న కంగారు మొదలయ్యింది. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంకాలం వరకు కారుమబ్బుల వైపే చూస్తున్నారు. కానీ చినుకు రాలలేదు.. ఆశ తీరలేదని సాగునే నమ్ముకున్న రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి.

ఆగిన వర్షం.. ఆశలు ఆవిరి

ఈ ఏడాది జూన్‌లో సాధారణ వర్షపాతం 141.3 మిల్లీమీటర్లు కాగా 162 మి.మీ. నమోదైంది. దీంతో వరి నారుమడులు సిద్ధం చేసుకుని సగానికి పైగా రైతులు వరి విత్తనాలు వేసుకున్నారు. మరికొంతమంది జూలై మొదటి వారంలో వేసుకోవాలనుకున్నారు. ఇంతలో వర్షాలు ఆగిపోవడంతో వాన చినుకు కోసం ఎదురుచూస్తున్నారు. జూలై నెల సాధారణ వర్షపాతం 235.8 మి.మీ. కాగా 12వ తేదీ వరకు 76 మి.మీ. వర్షపాతం నమోదైందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యవసాధికారి మోహనరావు 'సాక్షి'తో మాట్లాడుతూ జూన్‌లో వరుసగా కురిసిన వర్షాలతో విత్తనాలు నాటడం ఆలస్యమైందని, వర్షాలు తగ్గాక మొలక శాతం పెరిగిందని చెప్పారు. ఇంతలో ఎండల వల్ల ప్రతికూల వాతావరణం ఏర్పడిందన్నారు. ఈనెల 15వ తేదీలోగా వరి నారు వేసుకుంటే దిగుబడులు బాగుంటాయని, కానీ వాతావరణం అనుకూలించక వరి నారు వేయడం ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఎక్కడైనా పూర్తి స్థాయిలో మొలక రాకపోతే కేపీ సీడ్స్ వారికి తెలియజేసి విత్తనం అందజేస్తామన్నారు.

ఎర్రవాయి ప్రాంతంలో బీటలు వారిన భూమి

ఎర్రవాయి ప్రాంతంగా గుర్తింపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో పంట పొలాలు ఎక్కువ నీరు ఉన్నా, ఎక్కువగా ఎండకాసినా తట్టుకోలేవు. తేలికపాటి ఇసుక రేగడి భూములు అవ్వడంతో తడి పొడిగా ఉండాలి. గత నెల వర్షాలు కురవడంతో బుచ్చెయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతులు జూలై నెల ఆరంభం నుంచి వరి ఆకుమడులు వేశారు. ఇప్పుడు వాటికి తగినంత నీరు అందడం లేదు.

వారం రోజులుగా వేసవిని తలపిస్తున్న రీతిలో ఎండ కాస్తోంది. బుచ్చెయ్యపేట, కందిపూడి, అయితంపూడి, దిబ్బిడి, ఎల్‌బి పురం, బంగారుమెట్ట, లోపూడి, శింగవరం, పీడీ పాలెం, లూలూరు, పెదమదీన తదితర గ్రామాల్లో వరి ఆకుమడులు సరిగా నాటక ఆకు ఎదుగుదల లేదు. పలు గ్రామాల్లో భూమి బీటలు వారి వేసిన ధాన్యం భూమిలోనే ఉండిపోయి మొలకెత్తడం లేదు. వచ్చిన లేత ఆకు ఎండకు వడలిపోతోంది. దీంతో పలువురు రైతులు డీజిల్ ఇంజిన్‌తో నీరు తోడి కిలోమీటర్ల పొడవున ప్లాస్టిక్ పైపుల ద్వారా నీటిని తరలించి ఆకుమడులు ఎండిపోకుండా కాపాడుకుంటున్నారు. ఆకు మడి తడపడానికి రూ.500 నుంచి 1,000ల వరకు అదనపు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. ముందుగా రుతుపవనాలు పలకరించినా ఫలితం లేకపోయిందని నిరాశ చెందుతున్నారు.

ఎండిపోతున్న వరి నారు



ఈ ఏడాది ముందుగా వర్షాలు అనుకూలించాయని ఆనందించాము. దుక్కులు చేసి విత్తనాలు వేశాము. రైతు సేవా కేంద్రాల్లో అందజేసిన విత్తనాల నుంచి 40 శాతం మాత్రమే మొలకలు రావడంతో మళ్లీ విత్తనం వేసుకున్నాం. గత నాలుగు రోజులుగా మండుతున్న ఎండలకు రెండో దఫా వేసిన విత్తనం కూడా మొలక రాలేదు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి.

– పల్లే రామునాయుడు, గాదిరాయి, మాడుగుల మండలం

ఆరంభంలోనే కష్టాలు మొదలు



పది రోజుల కిందట వరి ఆకు వేశాను. వారం రోజులుగా వర్షాలు లేకపోగా ఎండలు మండిపోతున్నాయి. వరి ఆకుమడికి నీరందక భూమిలో పదును లేక సరిగా నాటకపోగా వచ్చిన లేత ఆకు ఎండవేడికి వడలిపోతుంది. ప్లాస్టిక్ పైపుల ద్వారా నీరు తోడి ఆకుమడిని తడుపుతున్నాం. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే మాకు నీటి కష్టాలు వచ్చాయి.

– గాడి చిరంజీవి, కందిపూడి, బుచ్చెయ్యపేట మండలం

టీడీఆర్ బాండ్లతో దళారులకు మేలు

- పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి
- విశాఖ 78వ వార్డు కార్పొరేటర్ గంగారాం డిమాండ్
- ముగిసిన సీపీఎం నేతల 24 గంటల దీక్ష



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గంగారాం

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, విశాఖ నగర 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం హెచ్చరించారు. పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన 24 గంటల దీక్ష శనివారం ముగిసింది. దీక్షలో కూర్చొన్న వారికి ఆయన నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీలో భాగంగా నిర్వాసితులకు పరిహారాన్ని నేరుగా నగదు రూపంలో చెల్లించాల్సిందేనన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం బాధితులకు మెరుగైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. టీడీఆర్ బాండ్ల వల్ల దళారులకు మేలు చేకూరుతుందని విమర్శించారు. నిర్వాసితులను మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. లేకుంటే 14 గ్రామాలకు చెందిన నిర్వాసితుల కుటుంబాలతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శంకరరావు, నిర్వాసితుల సంఘ కన్వీనర్ ఆర్.రాము, సీపీఎం నాయకులు ఎస్.బ్రహ్మాజీ, కర్రి అప్పారావు, రామ సదాశివరావు, కన్నుంనాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, కూండ్రపు సోమునాయుడు, పెంటకోట సత్యనారాయణ, కడారి అప్పారావు, కాండ్రేగుల బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో ఇగ్నో అధ్యయన కేంద్రానికి సన్నాహాలు



ఇగ్నో కేంద్రం ఏర్పాటు కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి

ఎంవీపీ కాలనీ (విశాఖ) : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) అధ్యయన కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఇగ్నో డైరెక్టర్ డాక్టర్ ధర్మారావు శనివారం తెలిపారు. పాడేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిట్టిబ్బాయి ప్రతిపాదన మేరకు త్వరలోనే కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శనివారం ఉషోదయ కూడలిలోని ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో కేంద్రం ఏర్పాటుపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ధర్మారావు మాట్లాడుతూ ఇగ్నో ద్వారా లక్షల మంది యువత ఉన్నత విద్యను అందిపుచ్చుకుంటున్నారన్నారు.

పాడేరులో అధ్యయన కేంద్రం ఏర్పాటు చేస్తే గిరిజన యువతీ యువకుల ఉన్నత చదువుకు బాటలు పడతాయన్నారు. కేంద్రం ఏర్పాటుకు ప్రిన్సిపల్ చిట్టిబ్బాయి ముందుకు రావడం పట్ల అభినందనలు తెలిపారు. త్వరలోనే ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

- షాక్ కొట్టిన స్మార్ట్ మీటర్

గుండె గుబిల్లు

- చిన్న బేకరీ షాప్‌నకు రూ.63 వేల బిల్లు
- బలవంతంగా అంటకడుతున్న స్మార్ట్ మీటర్లు
- లబోదిబోమంటున్న విద్యుత్ వినియోగదారులు



స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



స్మార్ట్ మీటర్ ఏర్పాటు తర్వాత వచ్చిన బిల్లు

నక్కపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు షాకిస్తున్నాయి. ఎంత వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం బలవంతంగా వీటిని అంటగట్టింది. ఫలితంగా వేలాది రూపాయల బిల్లులు రావడాన్ని చూసి వినియోగదారులు లబోదిబోమంటున్నారు. రాజయ్యపేట గ్రామంలో ఎరిపల్లి ముసిలి అనే వ్యక్తి నిర్మించిన షాపును ఇదే గ్రామానికి చెందిన శ్రీను అద్దెకు తీసుకున్నాడు. చిన్న బేకరీ షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ దుకాణాన్ని వ్యాపార అవసరాల కోసం వినియోగిస్తుండటంతో ట్రాన్స్‌కో అధికారులు డిసెంబరులో కేటగిరి 2 కింద స్మార్ట్ మీటరు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరిలో తొలిసారి రూ.37 వేల బిల్లు వచ్చింది. వందల్లో వచ్చే బిల్లు వేలల్లో రావడంతో సరిచేయమని శ్రీను స్థానిక ట్రాన్స్‌కో ఉద్యోగి తేజ ద్వారా లెటర్ పెట్టుకున్నాడు. మార్చి నెలలో రూ.4 వేలు చెల్లిస్తే సరిపోతుందని చెప్తే ఫోన్ పే ద్వారా చెల్లించాడు. తదుపరి నెలలో రూ.10 వేలు, తర్వాత 20 వేలు, రూ.30 వేలు బిల్లులు వచ్చాయి. తాజాగా జూలై ఒకటో తేదీన అన్నీ కలిపి రూ.63 వేల బిల్లు చెల్లించాలని తన మొబైల్‌కు మెసేజ్ వచ్చిందని శ్రీను తెలిపాడు. ట్రాన్స్‌కో మళ్లీ ఫిర్యాదు చేయగా.. మీ అభ్యర్థన అప్రూవల్ కాలేదని, అందుకే సమస్య పరిష్కారం కాలేదని చెప్పారని శ్రీను తెలిపాడు. తాను ఎన్ని యూనిట్లు వినియోగిస్తున్నాను, ఎంత బిల్లు వస్తోందనే వివరాలు బిల్లు రూపంలో తెలియపరచడం లేదన్నాడు. తమలాంటి పేద వారికి స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసి వేలాది రూపాయలు వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని వాపోతున్నాడు. గతంలో ఉన్న మీటరుకు నెలకు రూ. వెయ్యి నుంచి రూ.1200ల బిల్లు వచ్చేదని, ఇప్పుడు వేలల్లో వస్తోందని తెలిపాడు.

ఇదంతా కూటమి ప్రభుత్వ నిర్వాకమే .

విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా నాయకులు ఎం.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు తదితరులు రాజయ్యపేట వెళ్లి బిల్లుల గురించి తెలుసుకున్నారు. షాపు ముందు బాధితుడితో కలసి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచడంతోపాటు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ప్రజలపై మరింత భారం మోపిందన్నారు. అదానీ సంస్థ షిరిడీ సాయి ఎలక్ట్రికల్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ స్మార్ట్ మీటర్లను వినియోగదారులకు బలవంతంగా అంటగడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రీ పెయిడ్ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే వాటిని తొలగించి పగుల గొట్టాలని పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చిన మూడు నెలలు తిరక్కుండానే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయించారని మండిపడ్డారు. సీపీఎం మండల కన్వీనరు ఎం.రాజేష్, కాశీరావు, బైరాగి రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



బీచ్ పార్కులో బొమ్మలకు రంగులు

భీమిలి బీచ్ పార్కులోని బొమ్మలకు అధికారులు కొత్తగా రంగులు వేయించారు. ఇక్కడ పార్కు మధ్యలో శిష్యులతో ఉన్న బుద్ధుడు, మత్స్యకారుడు, డాల్ఫిన్ బొమ్మలు ఉన్నాయి. పార్కుకు ప్రధాన ఆకర్షణగా నిలిచే ఇవి దెబ్బతినడంతో పాటు రంగులు వెలిసిపోయి, కళావిహీనంగా తయారయ్యాయి. సందర్శకుల విజ్ఞప్తులు, పత్రికల్లో కథనాలపై అధికారులు స్పందించారు. ఇటీవల ఈ బొమ్మలకు మరమ్మతులు చేయించి, రంగులు వేయించారు. దీంతో ఇవి కళకళలాడుతున్నాయి. - భీమునిపట్నం

మేలు జాతి పశువుల కోసం..

- గుజరాత్ ఎన్‌డీబీ సహకారంతో లింగ నిర్ధారిత వీర్యం అభివృద్ధి
- 15 నుంచి 498 కృత్రిమ గర్భధారణ కేంద్రాల్లో వీర్యం పంపిణీ
- ఈ ఇంజక్షన్ ద్వారా 90 శాతం పెయ్యదూడలు పుట్టే అవకాశం



పాడి పశువులకు లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్లు వేస్తున్న వెటర్నరీ డాక్టర్

సాక్షి, అనకాపల్లి: మేలు జాతి పశువులు వృద్ధి చెందేలా లింగ నిర్ధారిత వీర్యం అభివృద్ధికి కేంద్ర పశుసంవర్ధక శాఖ అడుగులు వేస్తోంది. జిల్లాలో పాడి పశువుల సంఖ్యను పెంచి అన్నదాతకు ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే గుజరాత్‌లో గల న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) సహకారంతో మేలు జాతి వీర్యం తక్కువ ధరకు అందించి అన్నీ పెయ్యదూడలు పుట్టేలా వీర్యం పంపిణీ చేస్తోంది. రూ.150కే లింగ నిర్ధారిత పశు వీర్యం ఇంజక్షన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లావ్యాప్తంగా తొలి విడతలో 4,330 డోసులను అధికారులు సిద్ధం చేశారు. మొత్తం 50 వేల డోసులు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్ల పంపిణీని ఈ నెల 15న ప్రారంభించనున్నారు. గేదెలు, ఆవులకు ఆడ దూడలు మాత్రమే పుట్టేలా చేయడమే దీని ఉద్దేశం. దీనివల్ల 90 శాతం అధిక పాలసార గల పెయ్యదూడలు పుట్టేందుకు అవకాశం ఉంటుంది. పెయ్యదూడ పెరిగి మూడున్నరేళ్లకు గర్భం దాల్చేనాటికి దాని విలువ రూ.లక్షకు చేరుతుంది. అప్పట్నుంచి ఏటా ఒక్కో పెయ్య దూడను ఈనుతుంది. పాల ఉత్పత్తి పెరుగుతుంది. ఈనెల 15న 498 కృత్రిమ గర్భధారణ కేంద్రాల్లో లింగ నిర్ధారిత వీర్యం పంపిణీ ప్రారంభించనున్నామని పశుగణాభివృద్ధి జిల్లా కార్యనిర్వాహణాధికారి బెహరా ప్రసాదరావు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నాటికి ఈ కార్యక్రమం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

విశాఖకు మరోసారి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు



డాబాగార్డెన్స్: విశాఖ మహానగరం మరోసారి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు ఎంపికైంది. ప్రతి సంవత్సరం కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా వివిధ ప్రమాణాల ఆధారంగా ఈ అవార్డులను అందజేస్తుంది. ఈసారి విశాఖ మహానగరానికి 'స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డు 'దక్కింది. ఈ నెల 17న దేశ రాజధాని ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించిన ఈ సర్వేలో పట్టణాల్లోని పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పౌరుల సహకారం, సుస్థిర పరిష్కారాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ప్రమాణాల మేరకు విశాఖ స్పెషల్ కేటగిరీలో అవార్డును దక్కించుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నగర పౌరులు, అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందిని అభినందించింది. ఈ అవార్డు పరిశుభ్రతపై అవగాహన మరింత పెంచేందుకు దోహదపడుతుందని అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా.. విశాఖపట్నం ఈకో-విజయ్ కార్యక్రమం ద్వారా పర్యావరణ సుస్థిరత, పరిశుభ్రతలో రాణిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పరిశుభ్రతలో విశాఖ అద్వితీయమైన ప్రగతి సాధించింది. 2020, 2021లో దేశంలోనే 9వ ర్యాంకు సాధించింది. 2022లో 4వ ర్యాంకుకు ఎగబాకింది. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో అదే స్థానాన్ని నిలబెట్టుకుని టాప్-5లో నిలిచింది.

ధర్మశ్రీకి కన్నబాబు ఆశీస్సులు



కరణం ధర్మశ్రీకి శాలువా కప్పి సత్కరిస్తున్న కన్నబాబు రాజు

అచ్యుతాపురం: వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మశ్రీ నియామకాన్ని అధిష్టానం ప్రకటించిన తర్వాత ఆయన పార్టీని బలోపేతం చేసే పని ప్రారంభించారు. ముందుగా కన్నబాబు స్వగృహానికి వెళ్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శాలువాలు కప్పుకొని సత్కరించుకున్నారు. నిన్నటి వరకూ పార్టీ సమన్వయకర్తగా వ్యవహరించిన కన్నబాబును కలిసి ఆశీస్సులు తీసుకోవడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీని ఒకే తాటిపై తీసుకొచ్చేందుకు ఇటువంటి చర్యలు దోహదం చేస్తాయని సీనియర్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

దయచేసి వినండి..

విశాఖ రైళ్లకు కొత్త పేర్లు

- 2022లో వాల్తేరు డివిజన్‌లోని 17 రైళ్లకు పేర్లు మార్చాలని విజ్ఞప్తి
- మూడేళ్లయినా స్పందించని జోన్ అధికారులు
- జోన్‌కు జీఎం నియామకంతో మరోసారి తెరపైకి..

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు మార్గం సుగమం కావడంపై ఓ వైపు హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నా.. చారిత్రక ప్రశస్తి కలిగిన వాల్తేరు డివిజన్ కనుమరుగవుతుందేమోనన్న ఆందోళన అందరిలోనూ కొనసాగుతూనే ఉంది. జోన్ సరిహద్దుల డీపీఆర్‌లో స్వల్ప మార్పులు ఉండే సూచనలున్నాయని రైల్వే వర్గాలు చెబుతున్నా.. ఆ పరిస్థితులేమీ కనిపించడం లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాత అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. వాల్తేరు డివిజన్ వైభవాన్ని చాటి చెప్పేలా కొన్ని రైళ్లకు ఇక్కడి చారిత్రక పేర్లు పెట్టాలనే మూడేళ్ల క్రితం నాటి ప్రతిపాదన మరోసారి వినిపిస్తోంది. విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్న వివిధ రైళ్లకు ఉత్తరాంధ్రకు సంబంధించిన ప్రముఖ పుణ్యక్షేత్రాలు, నదులు, ప్రాంతాల పేర్లు పెట్టాలంటూ 2022లో అప్పటి వాల్తేరు డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులకు లేఖ రాశారు. మొత్తం 17 రైళ్లకు మంచి పేర్లు సూచిస్తూ వాటిని మార్చే అంశంపై ఆలోచన చేయాలని కోరారు.

సామాన్యులు సైతం గుర్తించేలా..: ప్రస్తుతం నడుస్తున్న ఈ 17 రైళ్లకు సరైన పేర్లు లేవు. దీంతో ప్రయాణికులు ట్రైన్ నంబర్లు గుర్తుపెట్టుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో వాల్తేరు డివిజన్ పరిధిలోని వారసత్వ ప్రాంతాలు, చారిత్రక ఆనవాళ్లను ఈ రైళ్లకు పేర్లుగా పెడితే.. సామాన్య ప్రయాణికులు కూడా సులువుగా గుర్తించగలుగుతారు. అయితే మూడేళ్ల క్రితం నాటి ఈ ప్రతిపాదనను అప్పటి ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ అధికారులు బుట్టదాఖలు చేశారు. కొత్త జోన్ ఏర్పడేందుకు అడుగులు పడుతున్న నేపథ్యంలో వాల్తేరు చారిత్రక ఆనవాళ్లని కొనసాగించేందుకు ఈ 17 రైళ్లకు ప్రతిపాదించిన పేర్లు పెట్టాలంటూ రైల్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

పేర్లు పెట్టాలని ప్రతిపాదిస్తున్న రైళ్లివే..

ట్రైన్ నం	నుంచి- వరకూ	ప్రతిపాదిత పేరు
12861/62	విశాఖ-కాచిగూడ-విశాఖ ఎక్స్‌ప్రెస్	వాల్తేరు ఎక్స్‌ప్రెస్
18519/20	విశాఖ-ఎల్టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్	రుషికొండ ఎక్స్‌ప్రెస్
18551/52	విశాఖ-కిరండూల్-విశాఖ ఎక్స్‌ప్రెస్	దంతేశ్వరి ఎక్స్‌ప్రెస్
18514/13	విశాఖ-కిరండూల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్	దండకారణ్య ఎక్స్‌ప్రెస్
22820/19	విశాఖ-భువనేశ్వర్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్	వంశధార ఎక్స్‌ప్రెస్
18518/17	విశాఖ-కోర్బా రైల్వే స్టేషన్	సింహాచలం ఎక్స్‌ప్రెస్
20811/12	విశాఖ-నాందేడ్ ఎక్స్‌ప్రెస్	మత్స్యకుండ్ ఎక్స్‌ప్రెస్
18512/11	విశాఖ-కోరాపుట్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్	కోలాబ్ ఎక్స్‌ప్రెస్
18573/74	విశాఖ-భగత్‌కీ కోఠీ ఎక్స్‌ప్రెస్	కురుసుర ఎక్స్‌ప్రెస్
18567/68	విశాఖ-కొల్లాం ఎక్స్‌ప్రెస్	సాగరకన్య ఎక్స్‌ప్రెస్
20816/15	విశాఖ-టాటా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్	ఉక్కునగర్ ఎక్స్‌ప్రెస్
22869/70	విశాఖ-చెన్నై సెంట్రల్ (ఎంఏఎస్) సూ.ఫా ఎక్స్‌ప్రెస్	సువర్ణరేఖ ఎక్స్‌ప్రెస్
18503/04	విశాఖ-సాయినగర్ షిర్డీ ఎక్స్ ప్రెస్	ఎల్లోరా ఎక్స్‌ప్రెస్
22874/73	విశాఖ-దిఘా ఎక్స్‌ప్రెస్	గోస్తనీ ఎక్స్‌ప్రెస్
22847/48	విశాఖ-ఎల్‌టీటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్	ఛత్రపతి ఎక్స్‌ప్రెస్
20803/04	విశాఖ-గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్	కచ్ ఆంధ్ర ఎక్స్‌ప్రెస్
22801/02	విశాఖ-చెన్నై సెంట్రల్ (ఎంఏఎస్) సూ.ఫా ఎక్స్‌ప్రెస్	సౌత్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్

గో ఆధారిత ఉత్పత్తులపై వర్క్ షాపు



వర్క్ షాప్‌లో గోఆధారిత ఉత్పత్తులు

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ జువాలజీ ఆధ్వర్యంలో గో ఆధారిత ఉత్పత్తులపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. గోపూజతో ప్రారంభమైన ఈ వర్క్ షాపులో పంచగవ్య ఉత్పత్తులు, గోఆధారిత వ్యవసాయ పద్ధతులు, ఉత్పత్తులపై అవగాహన కలిగించారు. మొదటి రోజు దంతమంజన్, ప్రమిదలు, ఫేస్ ప్యాక్, హెయిర్ ఆయిల్, షాంపూ, సబ్బులు, తదితర 20 రకాల ఉత్పత్తులను తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షకులు – క్షేత్ర గో సేవ సంయోజక్ ఆకుతోట రామారావు మాట్లాడుతూ గోవు మన సంస్కృతిలో పవిత్రమైనదన్నారు. అది మన జీవన శైలికి పునాదిగా నిలిచిందని అటువంటి గో ఆధారిత ఉత్పత్తులు ఉపయోగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. గో సంస్కృతిని ప్రోత్సహించవలసిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రాంత గోసేవ సంయోజక్ రాంజీ, ఆంధ్ర ప్రాంత శిక్షణ ప్రముఖ కృషి వడ్డీ, ఆంధ్ర ప్రాంత గోసేవ సహ సంయోజక్ ఓలేటి నారాయణ కుమార్, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో చికిత్స.. యువకుడికి ఊరట

- సత్వరం స్పందించిన ఆర్‌పీఎఫ్



యువకుడిని సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి బయటకు తీసుకువస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

గోపాలపట్నం: ఆర్పీఎఫ్ సిబ్బంది సకాలంలో స్పందించి గుండెనొప్పితో బాధపడుతున్న ఓ యువకుడికి వెంటనే చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల జరిగిన గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు ఖరగ్‌పూర్ నుంచి వెలుపుల మనోహర్ విశాఖ వచ్చాడు. సింహాచలంలో ఉన్న బంధువుల ఇంట్లో ఉన్నాడు. గిరిప్రదక్షిణ అనంతరం శుక్రవారం రాత్రి షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ నుంచి ఖరగ్‌పూర్‌కు బయలుదేరాడు. ట్రైన్ ఎక్కిన తరువాత కొద్దిసేపటికే ఏసీ బోగీలో ఉన్నా చెమటలు పట్టడంతో బంధువులకు సమాచారమందించాడు. వెంటనే సింహాచలం రైల్వే స్టేషన్‌కు చేరుకుని ఆర్‌పీఎఫ్ పోలీసులకు విషయం తెలియజేశారు. అదృష్టవశాత్తు రెడ్ సిగ్నల్ పడడంతో ఈ ట్రైన్ సింహాచలం రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై ఆగింది. దీంతో హుటాహుటిన వీల్‌చైర్‌తో వెళ్లి బాధితుడిని ట్రైన్ దించారు. 108కు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో ఏఎస్ఐ సీతారామ్ తన ద్విచక్రవాహనంపై గోపాలపట్నం బెహరా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన తరువాత అతని ఆరోగ్యం కుదుట పడింది. ఉదయం వరకు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి పంపించారు. సకాలంలో స్పందించి వైద్య సేవలు అందే విధంగా కృషి చేసిన రైల్వే పోలీసులకు మనోహర్, అతని బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక వడ్డీలు ఆశ చూపి కుచ్చుటోపీ



వ్యాపారి వెంకటేశ్వరరావు రాసి ఇచ్చిన ప్రాంసరీ నోట్లు చూపిస్తున్న బాధితులు, (ఇన్‌సెట్) ఫొటోలో భార్య పక్కన పరారైన పెదిరెడ్డి వెంకటేశ్వరరావు

- సత్యవరంలో రూ.25 కోట్ల మేర మోసం
- పరారైన వ్యాపారి వెంకటేశ్వరరావు
- లబోదిబోమంటున్న బాధితులు

పాయకరావుపేట: అధిక వడ్డీలు ఆశచూపి వందలాది మంది ప్రజల వద్ద రూ.లక్షల్లో అప్పులు చేశాడు. ఆపై తిరిగి చెల్లించకుండా కోట్లాది రూపాయలు ఎగ్గొట్టి ఓ వ్యాపారి పరారయ్యాడు. ఈ సంఘటన మండలంలో సత్యవరంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు లబోదిబోమంటూ విలేకరుల వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి కథనం మేరకు.. సత్యవరం గ్రామానికి చెందిన పెదిరెడ్డి అప్పారావు కుమారుడు వెంకటేశ్వరరావు 30 సంవత్సరాలుగా గ్రామంలోనే భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. అతను తొలుత తునిలో బట్టల షాపు, తర్వాత శ్రీనివాస జ్యువెలరీ షాపు పెట్టుకుని పలువురు కొనుగోలుదారులను ఆకర్షించాడు. వారితో నమ్మకం పెంచుకుని కొన్ని సంవత్సరాలుగా అధిక వడ్డీలు ఆశ చూపి రూ.లక్షల్లో రుణాలు తీసుకున్నాడు. వారికి ప్రతి నెలా వడ్డీలు చెల్లించేవాడు. దాంతో తుని, సత్యవరం, మాసాహేబుపేట, పెదరాంభద్రపురం, మంగవరం, తదితర గ్రామాలకు చెందిన 200 మందికి పైగా మహిళలు, పురుషుల వద్ద ప్రాంసరీ నోటులు రాసి ఇచ్చి డబ్బులు తీసుకున్నాడు. వితంతు, దివ్యాంగులు, వృద్ధాప్య పింఛనుదారుల నుంచి వడ్డీలు ఆశ చూపించి ప్రతి నెలా డబ్బులు కాజేసేవాడు. బంగారు వస్తువులు ఇస్తానని కొంతమంది వద్ద, వడ్డీ ఇస్తానని మరి కొంతమంది వద్ద నమ్మించి రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు కాజేసినట్లు తెలుస్తోంది. ప్రతి ఒక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.25 లక్షల వరకు నమ్మించి కాజేశాడు. సత్యవరంలో రూ.15 కోట్ల వరకు డబ్బులు తీసుకున్నట్లు బాధితులు ప్రాంసరీ నోట్లు తెచ్చి చూపించారు. పరారైన వ్యక్తి రెండు నెలలుగా ప్రజలకు సమాధానం సక్రమంగా చెప్పకపోవడం, ఫోన్‌కు సమాచారం ఇవ్వకపోవడం, కనిపించకపోవడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. వారం రోజులుగా వ్యక్తి కనిపించకుండా తునిలో బంగారం షాపు మూసివేసి ఉండటం గమనించి పలువురు బాధితులు లబోదిబోమంటున్నారు. ప్రజలను నమ్మించి మోసం చేసి పరారైన వ్యక్తి పెదిరెడ్డి వెంకటేశ్వరరావుపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని, దీనిపై హోం మంత్రి స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

8 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

దేవరాపల్లి: మండలంలోని కలిగొట్ల గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీస్‌లు శుక్రవారం రాత్రి దాడి చేశారు. ముందస్తు పక్కా సమాచారం మేరకు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.7,600 నగదు, 8 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు కలెక్టరేట్ వద్ద కల్లు గీత కార్మికుల ధర్నా



దొడ్డి నారాయణరావు

మాడుగుల రూరల్: గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్టు షాపులను తక్షణమే తొలగించి, గీత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు కల్లు గీత కార్మిక సంఘం మాడుగుల, చీడికాడ, మండలాలకు చెందిన అధ్యక్షుడు దొడ్డి నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అక్రమ మద్యం గ్రామాల్లో ఏరులై పారుతుందన్నారు. ప్రతి గ్రామంలో గుడి, బడి, చర్చి, దేవాలయం అని చూడకుండా బెల్టు షాపులు ఏర్పాటు చేసి, మద్యం అమ్మకాలు సాగిస్తుందన్నారు. దీనివల్ల కల్లు విక్రయాలు జరగక, కల్లు గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని, ఔషధ గుణాలు ఉన్న తాటికల్లును కేరళ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ, లక్షలాది గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రసాయనాలతో తయారు చేసిన మద్యాన్ని ప్రోత్సహిస్తూ గీత కార్మికుల ఉపాధిని దెబ్బతీసిందని విమర్శించారు. ఎక్సైజ్ సర్కిల్స్ పరిధిలో రూ.లక్షల్లో బెల్టు షాపులను వేలం వేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 3 వేల బెల్టుషాపులను వెంటనే తొలగించి, వాటిని నిర్వహిస్తున్న సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని కల్లు గీత కార్మికులు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



వెంకటేష్ (ఫైల్)

రావికమతం: రోలుగుంట మండలం కంచుగుమ్మల గోపి దాబా వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఈ నెల 7న రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడి తీవ్రంగా గాయపడిన యువకుడు నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం మృతి చెందాడు. బంధువులు కథనం మేరకు... రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామానికి చెందిన ఆరి వెంకటేష్ (24) ఈ నెల 7న నర్సీపట్నం నుంచి తన స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కంచుగుమ్మల దాటిన తర్వాత గోపి దాబా దగ్గర ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా పాడై గోతులు ఏర్పడ్డాయి. వీటిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి బోల్తాపడి అతడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ జీపులో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం బంధువులు మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తరలించగా పరిస్థితి విషమించటంతో విశాఖ కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే ఆర్థిక పరిస్థితి బాగోలేక పోవడంతో అక్కడ నుంచి అక్కడ శివాని ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ నుంచి శనివారం నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో టి.అర్జాపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య సహస్ర, రెండు సంవత్సరాల కుమారుడు రోహిత్ ఉన్నారు.

హెచ్‌ఎంను బెదిరిస్తున్న టీడీపీ నాయకుడు

- రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు

రోలుగుంట: మండలంలోని అర్ల గిరిజన పంచాయతీలో ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం బోనెల రామును ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పాడి శ్రీను అంతు చూస్తానని బెదిరించడమే గాకుండా విధులకు ఆటంకం కలిగిస్తున్నాడు. ఈ విషయమై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెచ్‌ఎం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన పాడి శ్రీను మద్యం సేవించి గ్రామస్తులతో తగాదాలు పెట్టుకోవడం, బ్లాక్ మెయిల్ చేసి తన అవసరాలు తీర్చుకోవడం పరిపాటిగా మారింది. దీనిలో భాగంగా పాఠశాలకు వచ్చి హెచ్‌ఎంను దుర్భాషలాడుతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 10న పేరెంట్సు, టీచర్ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు సదరు వ్యక్తి వచ్చి రభస చేశాడు. గ్రామస్తులు కల్పించుకుని అతడికి సర్దిచెప్పగా, తాను ఎమ్మెల్యే అనుచరుడినని, అధికార పార్టీ నాయకుడినని, తాను ఏం చేస్తే అదే చెల్లుతుందని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారించి అతడి నుంచి రక్షణ కల్పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం కోరారు.

స్నానానికి దిగి సెక్యూరిటీ ఉద్యోగి మృతి

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం కొత్తూరుకు చెందిన పి.సూరిబాబు శారదా నదిలో సరదాగా ఈతకు దిగి మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వారి వివరాలు మేరకు.. కొత్తూరుకు చెందిన సూరిబాబు అచ్యుతాపురం మండలంలోని ఎన్‌హెచ్‌పీఎస్‌లో సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం 9 గంటల సమయంలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీనిని గమనించిన సమీపంలోని రజకులు అతడి భార్య సుధకు సమాచారం అందించారు. ఆమె మృతి చెందిన వ్యక్తి తన భర్తే అని ధ్రువీకరించిన మేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఎట్టకేలకు గతుకుల రోడ్డుకు మోక్షం



గుండాల జంక్షన్ యూనియన్ బ్యాంక్ వద్ద రహదారి నిర్మాణ పనులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గుండాల జంక్షన్ నుంచి తుమ్మపాల వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. రోడ్ల పరిస్థితిపై పలు దఫాలుగా సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేసే పనులు ప్రారంభించారు. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారి పనులు త్వరితగతిన, పూర్తి నాణ్యతతో చేపట్టాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి టౌన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం హైమావతి సూచించారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ప్రతీ గది క్షుణంగా తనిఖీ చేశారు. అనంతరం రోగులతో స్వయంగా మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ప్రధాన మంత్రి జన యోజన కింద ఆర్యోగ కార్డులు ఎంత మందికి నమోదు చేశారు, నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి, తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ వాణి జగదీశ్వరీ, సీహెచ్‌వో డి. శారద, డిప్యూటీ హెచ్ఈవో బి. మంగమ్మ పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని వజ్ర కవచాలంకృతుల తోపాటు పూల మాలలతో అందంగా అలంకరించారు. ఆషాఢ మాసం శనివారం పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణ చేసి విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా దర్శించారు. స్థానిక గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 24 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	----	----
మూడోరకం	3,000	3,500

అనకాపల్లి సినిమాలు

రాజా	: సూపన్‌మన్
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: 3 డి
పర్తిసాయి	: ఓ భామ అయ్యో రామ
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: వర్జిన్ బాయ్స్
శ్రీ సత్య	: ది 100
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-19, బీ పాజిటివ్-10, ఓ పాజిటివ్-35, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెన్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 353 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

సాయమందిస్తే.. సాగు

- పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు
- పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టాలు
- వృత్తినే నమ్ముకుని సాగుకు సన్నద్ధం
- 7 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి వేస్తారని అంచనా



వెంకుపాలెంలో వర్షం లేకపోవడంతో ఎండిపోతున్న వరి నారుమడి

అనకాపల్లి: సేద్యాన్నే నమ్ముకుని రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర లేక ఏటా నష్టాలు మిగులుతున్నాయి. దాంతో మరుసటి సంవత్సరం సాగు పెట్టుబడులకు అప్పులు చేయాల్సి వస్తోంది. సీఎం చంద్రబాబు అధికారంలో ఉన్నన్నాళ్లూ రైతులకు ఈ దుస్థితి తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితి గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎన్నడూ ఎదురు కాలేదు. పండించిన పంటకు మద్దతు ధర కల్పించి సకాలంలో కొనుగోలు చేసేవారు. రైతు భరోసా నగదు సకాలంలో రైతులు ఖాతాలకు జమ కావడంతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉండేది. ప్రతి రైతు అధిక లాభాలతో రైతే రాజుగా నిలిచాడని అప్పటి ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న రైతుకు భటుడు స్థానం కూడా కల్పించలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు అదునుగా భావిస్తున్న వారు అన్నదాత సుఖీభవ నగదు కోసం ఎదురు చూస్తున్నారు.

కౌలు రైతులే అధికం..

మండలంలో 22 వేల మంది రైతులు ఉండగా, వ్యవసాయ శాఖ లెక్కలు ప్రకారం నేటి వరకూ కౌలు రైతులు 225 మందికి మాత్రమే గుర్తింపు కార్డులు ఇచ్చారు. వీరు మాత్రమే ఎక్కువగా పంటలు పండిస్తున్నారు. తుమ్మపాల, తగరంపూడి, వెంకుపాలెం, సీతానగరం, సీహెచ్ఎస్.అగ్రహారం, కూండ్రం, శంకరం, బవులవాడ, మామిడిపాలెం, మార్టూరు, మాకవరం, దిబ్బపాలెం, జగన్నాథపురం, మెట్టపాలెం, మెండుపాలెం, సుందరయ్యపేట, రొంగలివాని పాలెం, కుంచంగి, ఊడేరు, అల్లిఖిండిపాలెం, పాపయ్యసంతపాలెం, రేబాక, జాతీయ రహదారి ఆవలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో వరిపంట వేస్తారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే నారుమడులు వేశారు.

ఆకాశాన్నంటుతున్న పెట్టుబడులు...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్టుబడులకు తగినట్లుగా పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించారు. అంతేకాకుండా సాగుకు ముందుగానే రైతు భరోసా నగదు అందించారు. దాంతో ప్రైవేటుగా అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు. సాగు ఖర్చులకు ఇబ్బంది పడేవారు కాదు. ప్రస్తుతం పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులకు వచ్చిన ఆదాయం తగ్గిపోతోంది. మరోవైపు మార్కెట్లో ఎరువులు, విత్తనాలు, కూలీలు, ట్రాక్టర్ దక్కులకు ఇలా అధిక ధరలు ఉండటంతో రైతులు దిగాలుగా ఉన్నారు.

చెరకు గిట్టుబాటుగాక..

మండలంలో ఈ ఏడాది 7 వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. 2024లో 6,800 ఎకరాలు, 2023లో 5,900 ఎకరాల్లో వరి పంట వేశారు. చెరకు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని మూసివేయడంతో రైతులు వరిపంట వైపు మొగ్గు చూపుతున్నారు.

ఆర్‌జీఎల్-2537 రకం సాగుకు మొగ్గు

ఈ ఏడాది ఎక్కువగా ఆర్‌జీఎల్-2537 రకం విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరి కోసం 1,450 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. మండల పరిధిలో గవరపాలెం గౌరీ పీఏసీఎస్, గాంధీనగరం అన్నపూర్ణ సొసైటీ, సీహెచ్ఎస్ అగ్రహారం సొసైటీలు ద్వారా రైతులకు విత్తనాలు, యూరియా 1,200 వందల టన్నులు అందుబాటులో ఉన్నాయి.



సీతానగరంలో దుక్కు దున్నిన పొలం

మా కష్టాలు మారడం లేదు



ఏటా రెండెకరాల వరిపంట వేస్తాను. ఈసారి వర్షాలు ముందుగానే పడ్డాయి. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో భయం భయంగా ఉంది. ఈ కారణంగా నీరు లేక నారుమడి ఎండిపోతోంది. గతేడాది కేంద్ర ప్రభుత్వం రైతుకు రూ.6 వేలు నగదు ఇచ్చింది. దాంతో పెట్టుబడులకు కొంత ఇబ్బంది తప్పింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇంకా అన్నదాత సుఖీభవ నగదు ఇవ్వలేదు. ప్రభుత్వాలు మారిన మా కష్టాలు మారడం లేదు. నష్టాలు వచ్చినా వృత్తిని వదులుకోలేకపోతున్నాం.

– రాపేటి తాతారావు, వెంకుపాలెం గ్రామం, అనకాపల్లి మండలం

ప్రభుత్వమే ఆదుకోవాలి



దేశానికి అన్నం పెట్టిన రైతన్నలను ఆదుకోవాలి. కొత్తగా వ్యవసాయం చేయడానికి యువత ముందుకు రావడంలేదు. 20 సంవత్సరాలుగా నాలుగు ఎకరాల్లో వరి పండిస్తున్నాను. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా చాలాసార్లు నష్టపోయాను. కూటమి ప్రభుత్వం ఆదుకుంటామని చెప్పిన మాటలను నిలబెట్టుకోవాలి. ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి సహాయం కోసం ఎదురు చూస్తున్నాను.

– పంచదార్ల కన్నారావు, రైతు, తుమ్మపాల గ్రామం, అనకాపల్లి మండలం

కొండుపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ

రెవెన్యూ అధికారులపై సీపీఐ ఆగ్రహం



ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు

అనకాపల్లి: మండలంలోని కొండుపాలెం గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 52లో విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైతే, మండల రెవెన్యూ అధికారులు నిద్రావస్థలో ఉన్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు విమర్శించారు. సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఆయన ప్రభుత్వ భూమిని పరిశీలించి మాట్లాడారు. విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవల్సిన రెవెన్యూ అధికారులు ఆక్రమణదారుడితో లాలూచీ పడుతున్నట్లు స్పష్టమవుతుందన్నారు. ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వియ్యపు రాజు, జిల్లా సమితి సభ్యులు బి. బాబ్జి, కె. త్రినాథ్, డి.హరీష్, పప్పల ఈశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు చక్రస్నానం చేస్తున్న అర్చకులు



కలశాలతో అష్టోతర పూజలు

అనకాపల్లి: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి వివిధ పూజలు, చక్రస్నానం, పూర్ణాహుతి హోమం, స్వామివారికి ఏకోత్తర సహస్ర(1001) కలశాలతో 108 కలశాలతో అష్టోతర పూజలు, సాయంత్రం ధ్వజావరోహణ, లక్ష తులసి, లక్ష కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు విజయబాబు మాట్లాడుతూ 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో 1870లో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ జరిగిందన్నారు. ఇది వంద సంవత్సరాల పూర్తయిన సందర్భంగా వజ్జల నరసింహాచార్యులు ఆధ్వర్యంలో 1970లో పవిత్రోత్సవాలు ప్రారంభించారన్నారు. ఆనాటి నుంచి ఏటా ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. అర్చకులు పులఖండం ప్రసాద్, రాజేష్, ఈవో బి.మురళీకృష్ణ, చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల దీక్షలు

కశింకోట: స్థానిక గవరపేటలో శారదా గణపతి రామాలయంలో వారం రోజులుగా మహిళలు లలితా సహస్ర నామ పారాయణ నిర్వహిస్తున్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజు లలితాదేవి కలశాన్ని నెలకొల్పి మండల దీక్షగా తీసుకొని దీన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఇది 42 రోజుల పాటు కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



భజనలు చేస్తున్న సీతారామ భజన బృందం

తుమ్మపాల: హిందూ ధర్మాన్ని మరింత పరిరక్షించడమే లక్ష్యంగా హిందులంతా కృషి చేయాలని సీతారామ భజన బృందం అధ్యక్షుడు చూచికొండ రమణ పిలుపునిచ్చారు. మండలంలో మారేడుపూడి కాలనీలో సీతారామ భజన బృందం ఆధ్వర్యంలో గొల్ల వెంకటరమణ, లక్ష్మి దంపతుల ఇంటి వద్ద శనివారం ఇంటింటా గోవిందుడు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు సీతారాముల విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు. హిందువులంతా సీతారాముల భజనల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గంగుపాం తాతయ్య, భక్తులు పాల్గొన్నారు.

17న జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహాసభ



జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మొల్లి సన్నిబాబు, సంఘం నాయకులు

అనకాపల్లి: విజయవాడలో ఈనెల 17న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మొల్లి సన్నిబాబు తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ విజయరెసిడెన్సీ హాల్లో మహాసభ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో బీసీలను ఓటు బ్యాంకుగానే ప్రజాప్రతినిధులు వాడుకుంటున్నారన్నారు. బీసీ వర్గీకరణ చేసి రాజ్యాధికారం వచ్చే వరకూ పోరాటాలు చేసే సమయం ఆసన్నమైందన్నారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. చట్ట సభలతోపాటు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లాడ అప్పలరాజు, బోయిన భానుమూర్తి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, జిల్లా నాయకులు రంధి గణపతి, బండారు అప్పారావు, ఊరిగిటి నాగమణి, దాలి బోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వార్డులో పరిశుభ్ర వాతావరణమే లక్ష్యం

82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత



అంజయ్యకాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి: పరిశుభ్రమైన వాతావరణంలో జీవించేందుకు ప్రజలు చర్యలు చేపట్టాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత తెలిపారు. వార్డు పరిధిలో గాంధీనగరం, అంజయ్యకాలనీలో శనివారం సాయంత్రం ఆమె పర్యటించి, స్థానికులను సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన పైపులైన్లు లీకేజీల వల్ల నీటి సరఫరా కలిగిన ఇబ్బందులను తొలగించి ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు కారణంగా ప్రజలు వ్యాధులు బారినపడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని, జీవీఎంసీ శానిటరీ సిబ్బంది ఎప్పుడైన రానిచో తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నూకాంబిక దేవస్థానం మాజీ డైరెక్టర్ కొండూరు రవీంద్రనాథ్, పార్టీ నాయకులు ఆకుల సంతోష్, నంబారు అప్పారావు, శేషగిరిరావు, బీఎల్ఎన్ శర్మ, వెంపటి శ్రీహరిరావు, ఏడువాకల నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడు క్వారీ లారీలపై చర్యలు తీసుకోవాలి

- పార్టీ శ్రేణులతో కలిసి పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు ర్యాలీ



రైల్వే స్టేషన్ మేనేజర్ పీడీపీ గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు

అనకాపల్లి: కూటమి ఏడాది పాలనలో మండలంలో క్వారీలను పిండిచేయడమే కాకుండా, నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడు రాయిని తరలించే సమయంలో అనకాపల్లి విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సేఫ్టీ గడ్డర్లను టిప్పర్ లారీలు ఢీ కొంటున్నాయని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు విమర్శించారు. స్థానిక రింగ్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకూ శనివారం పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. రైల్వే స్టేషన్ మాస్టర్ పీడీపీ గుప్తాకు వినతిపత్రం అందజేశాయి. జానకీరామరాజు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో రైల్వే అండర్ బ్రిడ్జికి ఇరువైపులా రైల్వేఅధికారులు ఏర్పాటు చేసిన సేఫ్టీ గడ్డర్లను భారీలోడుతో రాత్రిళ్లు ఢీ కొట్టడంతో ఇటు రైల్వే ఆస్తులకు, అటు ప్రజలకు నష్టం వాటిల్లుతుందన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్చి 17న అనకాపల్లి మండలం మార్టూరు క్వారీ నుంచి రాంబిల్లి వెళ్లే టిప్పర్ లారీ ఢీ కొనడంతో సేఫ్టీగార్డులు విరిగిపోయి రహదారిపై పండిపోయాన్నారు. రైల్వే ట్రాక్ చిన్నాభిన్నం కావడంతో విజయవాడ నుంచి విశాఖ వెళ్లే గూడ్స్ రైలు డ్రైవర్ అప్రమత్తమై రైలును చాకచక్యంగా నిలుపుదల చేయడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. గతంలో రహదారికి ఇరువైపులా స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసినప్పటికీ అధిక లోడులు కారణంగా వేసిన మూడు మాసాలకే ధ్వంసమైందన్నారు. ఈ నెల 10న రాత్రి సమయంలో క్వారీ లారీ రైల్వే సేఫ్టీ గార్డును ఢీ కొట్టిందన్నారు. రైల్వే, స్థానిక పోలీసులు ఈ లారీని గుర్తించడంలో విఫలమైనట్లు విమర్శించారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లయితే ప్రమాద కారకులను త్వరితగతిన పట్టుకునేందుకు వీలు ఉంటుందన్నారు. రైలే ఆస్తులు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు విజయరామరాజుపేట రైల్వే అండర్ పాస్ వద్ద ప్రమాదాలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ మాట్లాడుతూ క్వారీ లారీలో 60 నుంచి 70 టన్నులు లోడు తరలించడం వల్ల ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గతంలో ఎంపీలు క్వారీలను దోచుకోలేదని, ప్రస్తుత ఎంపీ వీటిపై పడడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80, 84 వార్డుల ఇన్‌చార్జులు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ డైరెక్టర్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, నాయకులు గైపూర్ రాజు, పి.పద్మ, ఎం.శోభ, పార్వతీదేవి, పలకా సత్యనారాయణ, ఉగ్గిన అప్పారావు, దాడి నారాయణరావు, మూనూరు శ్రీనివాసరావు, కోన ఉమ తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన శంకరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి



ధ్వంసమైన శంకరం రైల్వే వంతెనను పరిశీలిస్తున్న సీపీఐ నాయకుడు భద్రం

తుమ్మపాల: తీవ్ర అధ్వానంగా తయారైన శంకరం రైల్వే వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ నాయకుడు వైఎస్ భద్రం డిమాండ్ చేశారు. మండలంలో శంకరం రైల్వే వంతెనను శనివారం ఆయన పరిశీలించారు. ధ్వంసమైన గోడలను చూసి అసహనం వ్యక్తం చేశారు. పట్టణానికి సమీపంలో ఉన్న బ్రిడ్జి అత్యంత దారుణంగా ఉందని, పట్టణం నుంచి కలెక్టరేట్‌కు నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు, అధికారులు రాకపోకలు చేస్తున్నారన్నారు. అధికారులు పట్టించుకోవకపోవడం దారుణమన్నారు. బ్రిడ్జిపై ధ్వంసమై ప్రహరీ కూలిపోయి వందడుగుల లోతులో ఉందని, ప్రమాదాలు జరిగితే భారీగా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రహదారులకు, వంతెనల నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ప్రకటనలకే పరిమితమయ్యిందని, ఆచరణలో జరగడం లేదనేది ఈ వంతెనే నిదర్శనమన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు వంతెన ఇరువైపులా ప్రహరీ పునర్నిర్మించి, గుంతలను పూడ్చి ప్రజల ప్రాణాలు కాపాడాలని, జీవీఎంసీ అధికారులు విద్యుత్ దీపాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

కశింకోట: మండలంలో కొద్ది రోజులుగా వేసవిని తలపించే విధంగా ఎండలు కాస్తుండటంతో ఒక వైపు ప్రజలు, మరో వైపు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఎండలు కాయాల్సిన వేసవి కాలంలో వర్షాలు కురిశాయి. వర్షాలు కురవాల్సిన ప్రస్తుత సమయంలో ఎండలు కాస్తున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ వరి నారు వేయడానికి అవకాశం లేకపోతుందని ఆవేదన చెందుతున్నారు. మరో వైపు ఎండ తీవ్రతతో బయటకు అడుగు వేయలేకపోతున్నామని, నిత్య కార్యకలాపాలు జరుపుకోవడానికి అవకాశం లేక ఇళ్లకే పరిమితం కావలసి వస్తోందని వాపోతున్నారు. నాలుగు రోజులుగా ఎండలు తీవ్రంగా కాస్తున్నాయి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతం వరకు అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుండటంతో ఆందోళన చెందుతున్నారు. సకాలంలో నారు వేయకపోతే పంటలు సరిగ్గా పండక నష్టపోవలసి వస్తుందని, నీరు తడి లేక నారుమడులు ఎండిపోతాయని రైతులు నిట్టూరుస్తున్నారు.

15న నక్కపల్లిలో జాబ్‌మేళా

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 15న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ జాబ్‌మేళాలో 14 కంపెనీలు హాజరు కానున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.